క్లుప్తంగా

నేత్రదానం



విజయకుమార్ (ఫైల్)

విడవలూరు : విడవలూరులోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన నక్కా విజయకుమార్ (49) బ్రెయిన్ స్ట్రోక్‌తో 15 రోజుల నుంచి నెల్లూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందారు. కుటుంబసభ్యుల కోరిక మేరకు మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో మృతుడి నేత్రాలను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు: పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



విగతజీవిగా పడి ఉన్న వృద్ధురాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయం వెలుపల రోడ్డుపై గురువారం గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందింది. ఆమె కొన్నిరోజులుగా ఆలయ పరిసరాల్లోనే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వివరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు 12న ఇంటర్వ్యూలు

పొదలకూరు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల(ఆయా) పోస్టులకు ఈనెల 12వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా గురువారం సీడీపీఓ మాట్లాడుతూ నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్లు, వయస్సు, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. మండలంలో మరుపూరు, ప్రభగిరిపట్నం, మహ్మదాపురం ఎస్టీ, కల్యాణపురం, పొదలకూరు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఇంటర్వ్యూలను నిర్వహిస్తామన్నారు.

⇨ తోటపల్లిగూడూరు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు సంబంధించి ఈనెల 12న ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీఓ రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విలుకానుపల్లి(ఎస్సీ) అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు మల్లికార్జునపురం(ఎస్టీ), వరకవిపూడి-1(ఎస్సీ), సౌత్‌ఆములూరు-2(ఓసీ), కొత్తకోడూరు-2(ఎస్సీ), కోడూరు ఏడబ్ల్యు(ఎస్సీ) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 12న నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

⇨ ఇందుకూరుపేట: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు ఈనెల 12న ఇంటర్వ్యూలు ఉంటాయని అదనపు సీడీపీఓ రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న వారు నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

డిపో మేనేజర్‌గా వెంకటేశ్వర్లు

నెల్లూరు సిటీ: నెల్లూరు డిపో-1 మేనేజర్‌గా జి.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. డిపో-1 సీఐ సునీత ఇన్‌చార్జి మేనేజర్‌గా ఉన్నారు. ఆమె స్థానంలో ప్రభుత్వ ఆదేశాలతో గూడూరు డిపో మేనేజర్ జి.వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించారు.

సమస్యలపై వినతి

నెల్లూరు రూరల్: కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను గురువారం కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి కోవూరు రైతులు కూడా హాజరయ్యారు. చక్కెర ఫ్యాక్టరీ రైతులు, ఉద్యోగుల సమస్యలపై చెప్పగా కలెక్టర్ అనుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

వేళాంగణి మాత ఆరాధనోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి

తోటపల్లిగూడూరు : కోడూరు వేళాంగణి మాత చర్చి ఆరాధనోత్సవాలకు ముస్తాబైంది. సెప్టెంబర్ 8వ తేదీ లోక రక్షకునిగా పేరొందిన ఏసుక్రీస్తు తల్లి వేళాంగణి మాత జన్మదినం. ఈ నేపథ్యంలో ఏటా చర్చిలో సెప్టెంబర్ 6, 7, 8వ తేదీల్లో మూడు రోజుల పాటు ఆరాధనోత్సవాలు వేడుకగా జరుగుతుంటాయి. 1980లో నిర్మితమైన ఈ చర్చిలో ఏటా వేళాంగణి మాత జన్మదిన ఉత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉత్సవాల ఏర్పాట్లకు చర్చి ఫాదర్ అన్ని ఏర్పాట్లు చేశారు.

మతాలకతీతంగా ప్రార్థనలు

ఇక్కడి ఆరాధనోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి క్రైస్తవులతో పాటు ఇతర మతాలకు చెందిన భక్తులు కూడా వస్తుంటారు. ఉత్సవాల్లో కీలమైన వేళాంగణి మాత జన్మదినం నాడు చర్చికి భక్తులు పోటెత్తి వస్తారు. అదే రోజు రాత్రి అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని రాత్రి చర్చిలోనే జాగరణ చేస్తారు. అనంతరం మరుసటి రోజు భక్తులు కోడూరు సాగరతీరంలో పుణ్యస్నానాలు చేసి తమ మొక్కులను తీర్చుకొంటారు.

ఉత్సవ వివరాలు

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 6వ తేదీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. రాత్రి ముత్యాలతోపు వరకు వేళాంగణి మాత తేరు ప్రదక్షణ జరుగుతుంది. 7వ తేదీ ఆరాధన-స్వస్థత ప్రార్థనలు, జపమాల నవదిన ప్రార్థనలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి దివ్యబలి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు కొత్త కోడూరు వరకు అమ్మవారి తేరు ప్రదక్షణను నిర్వహిస్తారు. చివరిరోజు అమ్మవారి జన్మదినం రోజు 8వ తేదీ పగలంతా ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు సింహపురి పీఠాధిపతి డాక్టర్ ఎండీ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రార్థనలు ఉంటాయి.



ఉత్సవాలకు ముస్తాబైన వేళాంగణి చర్చి



భక్తులు తరలిరావాలి



మూడు రోజుల పాటు అత్యంత వేడుకగా జరిగే వేళాంగణి మాత ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక వసతి, తాగునీరు, ఉచిత భోజన సదుపాయాలను కల్పిస్తున్నాం. భక్తులు తరలిరావాలి.

– ఫాదర్ లూకాస్‌రాజ్, కోడూరు వేళాంగణి చర్చి డైరెక్టర్

కనీస వేతనాలివ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న రెహానాబేగం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి రెహానాబేగం అన్నారు. మండలంలోని సీఐటీయూ కార్యాలయంలో మండల మహాసభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జునరావు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై శిక్షణ



మాట్లాడుతున్న ఆత్మ పీడీ మురళి

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో రైతులకు ఉద్యాన పంటలపై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిమ్మసాగులో యాజమాన్య పద్ధతులు, సమస్య రక్షణా చర్యలపై శాస్త్రవేత్త డాక్టర్ తిరుపాల్ సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ మురళి, హెచ్ఓ ఆనంద్, ఏఓ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



రజత్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నరసింహారెడ్డి

కోవూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా శివుని నరసింహారెడ్డి నియమితులైన నేపథ్యంలో పార్టీ కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ నలుబోలు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కవరగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆమెకెలాంటి సంబంధం లేదు’

పొదలకూరు: టేకు చెట్లు ఉన్న పొలంతో రాజేశ్వరమ్మకు ఎలాంటి సంబంధం లేదని నెల్లూరు చెందిన రామ్మూర్తి పేర్కొన్నారు. మండలంలోని మరుపూరు గ్రామానికి సమీపంలో ఇటీవల టేకుచెట్ల నరికివేతపై వివాదం రాజుకున్న నేపథ్యంలో గురువారం రామ్మూర్తి విలేకరుల సమావేశం నిర్వహించారు. తనకు 2009 నుంచి ఇక్కడ 11.75 ఎకరాలు పొలం ఉందన్నారు. కొద్దిరోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు తన పొలంలో టేకుచెట్లు నరికి ఎత్తుకెళ్తే గతనెల 9న పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. తనకు పరిచయం ఉన్న టీడీపీ నాయకుల ద్వారా మిగిలిన టేకుచెట్లను కాపాడుకునేందుకు వారికి బాధ్యతలు అప్పగించామన్నారు.

సోషల్ మీడియా వేదిక రాజేశరమ్మ స్పందన

కాగా తన పొలంలో టేకు చెట్లను అక్రమంగా నరికి సొమ్ముచేసుకున్నారని కొద్దిరోజులుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేస్తున్న నెల్లూరు నగరానికి కందికట్ల రాజేశ్వరమ్మ గురువారం సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. పొలం హద్దులు మార్చే కుట్ర జరుగుతున్నట్టు పేర్కొన్నారు. పోలీసులు తనకు న్యాయం చేయడం లేదని వెల్లడించారు. ఈ వ్యవహారంపై జిల్లాకు చెందిన ఓ మంత్రిని కూడా కలిసినట్లు తెలిపారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఇందులోకి అనవసరంగా లాగుతున్నారని, విలేకరుల సమావేశంలో బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని వాపోయారు.

కుళాయి పన్నుల వసూలు వేగవంతం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్పొరేషన్ టీపీఆర్వో వాసుబాబు, ఇంజినీరింగ్ విభాగం ఈఈలు శేషగిరిరావు, రహంతుజానీ, అనిల్‌కుమార్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇంజినీరింగ్ విభాగం, హౌసింగ్, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గృహాలకు తాగునీటి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా వాడుతున్న కుళాయిలను గుర్తించి పన్నులు నమోదు చేయాలని సూచించారు. టిడ్కో గృహాల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయించి ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజినీరింగ్, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, డీఈఈలు ప్రసాద్, ముజాహిద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(పొగతోట): పొదుపు మహిళలు ఆర్థిక లావాదేవీలు సక్రమంగా నిర్వహించేలా అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. గురువారం డీఆర్‌డీఏ కార్యాలయంలో 15 మండలాలకు చెందిన సీఆర్పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజకుమారి మాట్లాడుతూ అవసరాలకు తగిన విధంగా ఆర్థిక ప్రణాళికను తయారు చేసుకోవడం, తెలివిగా ఖర్చు, పొదుపు చేయడం, బీమా, పెన్షన్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ రవిచంద్ర, డీపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రావిఆకుపై సర్వేపల్లి రాధాకృష్ణన్



పొదలకూరు: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావి ఆకుపై సర్వేపల్లి రాధాకృష్ణన్ బొమ్మను చిత్రీకరించారు. టీచర్స్ డేను పురస్కరించుకుని ఆయనకు కళాత్మకంగా నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. సూరాయపాళెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి మోటార్‌బైక్‌పై తాటిపర్తికి వస్తుండగా మార్గమధ్యలో బ్రిడ్జి వద్ద బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నాగిరెడ్డి తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు.

ఫెన్సింగ్ రాళ్ల ధ్వంసంపై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన సునంద పొలానికి వేసిన ఫెన్సింగ్ రాళ్లను అదే గ్రామానికి చెందిన ఐదుగురు బుధవారం రాత్రి ధ్వంసం చేసినట్టు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. సునంద ఇటీవల తనకు చెందిన 1.60 ఎకరాల పొలానికి రూ.1.50 లక్షలు వెచ్చించి ఫెన్సింగ్ వేసుకున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన వారు పొలం వివాదంలో భాగంగా పెద వెంకటేశ్వర్లు, రామయ్య, పి.వెంకటేశ్వర్లు, సుశీల, వీరమ్మ కలిసి సమ్మెట్లతో ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేసి నష్టపరిచారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణం నేడు

పొదలకూరు: స్థానిక శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తామని నిర్వాహకులు గురువారం వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బాంబేరోడ్డుకు ఇరువైపులా తాత్కాలిక, శాశ్వత అక్రమ నిర్మాణాలను ఈనెల 9వ తేదీలోపు తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ సమస్యలు, కాలువల్లో పూడిక తదితర పనుల నిమిత్తమై ఆక్రమణలు తొలగించక తప్పదన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు బుధవారం రాత్రి స్థలం విషయంలో దాడికి పాల్పడినట్టు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాల్యాద్రి, మనోహర్, మాలకొండారెడ్డి, మస్తాన్‌రెడ్డిలు నారాయణరెడ్డిపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలువురికి కాకాణి పరామర్శ



కల్యాణపురంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మనుబోలు: చిన్నారులకు ధైర్యం చెబుతున్న కాకాణి

పొదలకూరు: మండలంలోని కల్యాణపురం, నేదురుమల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కల్యాణపురం నాయకుడు వెన్నపూస దయాకర్‌రెడ్డికి చెందిన బంధువు దశదిన కర్మకు హాజరై నివాళులర్పించారు. నేదురుమల్లి సర్పంచ్ ఉడతా రమేష్ బంధువు దశదిన కర్మకు వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, నాయకులు వెన్నపూస కృష్ణారెడ్డి, ఆకుల గణేష్‌రెడ్డి, రావుల ఇంద్రసేన్‌గౌడ్, వెన్నపూస ఓబుల్‌రెడ్డి, మాలపాటి రమణారెడ్డి, వెన్నపూస యానాదిరెడ్డి, బడుగు శ్రీనివాసులు, శ్రీహరి, పెంచలరెడ్డి, లక్ష్మయ్య, వెంకట్రావ్ తదితరులు ఉన్నారు.

⇨ మనుబోలు: మండలంలోని వడ్లపూడి గ్రామానికి చెందిన దంపతులు దద్దోలు సురేష్, దివ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి పిల్లలిద్దరూ అనాథలయ్యారు. దీంతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం వడ్లపూడి గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఈగా సురేష్, ప్రతాప్‌రెడ్డి, రాఘవరెడ్డి ఉన్నారు.

⇨ మనుబోలుకు చెందిన పార్టీ నాయకుడు చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి సతీమణి జెడ్పీటీసీ సభ్యురాలు అనితమ్మ ఇటీవల కిడ్నీ ఆపరేషన్ చేయించుకోవడంతో వారిని కూడా కాకాణి పరామర్శించారు.

గ్రామీణులకు ఉపయుక్తంగా ‘ఫ్యామిలీ డాక్టర్’



మానేగుంటపాడులో..

కొడవలూరు: గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉందని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామన్నపాళెం, మానేగుంటపాడులో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరానికి రాలేని వారుంటే ఇంటికే వచ్చి వైద్య పరీక్షలు చేసి మందులు, వైద్య సలహాలిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్ఎం నదియ, ఆశా కార్యకర్తలు పద్మ, కిశోరమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం నేడు

కొడవలూరు: మండలంలో 17 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. వీరిని టీచర్స్‌డే సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో శుక్రవారం సన్మానిస్తారు. కొడవలూరు హైస్కూల్ టీచర్ బి.రవీంద్రకుమార్, యల్లాయపాళెం హైస్కూల్ (బి.వెంకయ్య), నార్తురాజుపాళెం హైస్కూల్ (పి.అన్నపూర్ణ), కొత్తవంగల్లు హైస్కూల్ (టి.వెంకటేశ్వర్లు), గండవరం హైస్కూల్ (ఎం.పవన్‌కుమార్), రామన్నపాళెం ప్రాథమికోన్నత పాఠశాల (గౌస్‌బాషా), దామేగుంట పాఠశాల (పి.షాజహాన్), కమ్మపాళెం పాఠశాల (ఎం.భవాని), పెమ్మారెడ్డిపాళెం పాఠశాల (రియాజ్), పద్మనాభసత్రం ప్రాథమికోన్నత పాఠశాల (పి.పద్మ), పెయ్యలపాళెం పాఠశాల (ఎం.కిరణ్‌కుమార్), కొడవలూరు పాఠశాల (ఎస్.రామకృష్ణ), గుర్రాలదిన్నె పాఠశాల (సురేష్‌కుమార్), నార్తురాజుపాళెం పాఠశాల (ఎం.ప్రమీల), రమణారెడ్డిగుంట పాఠశాల (వై.రవి), రేగడిచెలిక పాఠశాల (టి.గోపాల్), సీఆర్ఎంటీ సీహెచ్.శ్రీహరిబాబులు మండల స్థాయిలో బెస్ట్ టీచర్లుగా ఎంపికయ్యారని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



నిమజ్జనానికి ముస్తాబైన గణనాథుడు

కొడవలూరు: కొడవలూరులో యాదవ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని ప్రతిమకు గురువారం రాత్రి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని యువకులు రంగులు చల్లుకొంటూ ఉత్సాహంగా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నీటి సంఘం అధ్యక్షుడు సక్కా రమణయ్య, నేతాజీ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు కోవూరు వెంకీ, యాదవ యూత్ సభ్యులు అంబటి విజయకుమార్, మోర సుశాంత్, ఎన్.సుధాకర్, ఎం.రమేష్, అభిలాష్, శ్రీనివాస్, సురేష్, అనీల్‌కుమార్, యశ్వంత్, సుమంత్, తరుణ్, కృష్ణ పాల్గొన్నారు.



పొదలకూరు: వేలంలో లడ్డూను దక్కించుకున్న యువకుడు

వినాయకుని లడ్డూ రూ.1.82 లక్షలు

పొదలకూరు: పట్టణంలోని రామనగర్‌గేటు సెంటర్‌లో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని బొమ్మ వద్ద బుధవారం 36 కేజీల స్వామి లడ్డూకు వేలంపాట నిర్వహించగా రూ.1.82 లక్షలకు దుగ్గినేని వంశీకృష్ణ దక్కించుకున్నారు.

డీఎన్నార్ పాఠశాలలో క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

పొదలకూరు: టీచర్స్ డే సందర్భంగా పొదలకూరులోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులు, విద్యార్థినుల మధ్య క్రీడాపోటీలను గురువారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రకటించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినుల మధ్య సత్సంబంధాలు నెలకొనేందుకు ఇలాంటి క్రీడాపోటీలు ఉపయోగపడతాయని హెచ్ఎం శైలజ వెల్లడించారు.